కథ

# రామ్ అండ్ లక్ష్మణ్ కేఫ్

- భమిడిపాటి సోమయాజి

**విమల** ముత్యాలముగ్గు సినిమా చూసి వచ్చిన తర్వాత తన భర్త వెంకటేశ్‌తో అంది "అవును భగవంతుడు ప్రత్యక్షమైతే నా మేనమామ చెవులో వెంట్రుకలు యిమ్మన్నాడట! అన్న డైలాగ్ రావుగోపాలరావు ఎంత బాగా చెప్పాడండి. అసలు మేనమామ చెవులో వెంట్రుకల వలన మేనల్లుడికి అదృష్టం కలుగుతుందా "ఇప్పుడు టైమ్ పన్నెండవుతోంది పడుకో రేప్పొద్దున్న చెపుతా" న్నాడు.

పొద్దునే కాఫీతాగుతూ "విమలా! నిన్న నువ్వు ఒక ప్రశ్న వేశావు కదా రా చెపుతాను. మేనమామ చెవులో వెంట్రుకలుంటే మేనల్లుడికి అదృష్టమన్నది అనాదిగా వస్తున్న జోక్. కాని చెవులో ఎంత ఎక్కువ జుట్టుంటే అంత అదృష్టమని చెపుతారు. అసలు మన తెలుగు కుటుంబాల్లో మేనమామది ఒక ప్రత్యేకమైన స్థానం. ఎవడైనా చెడిపోతే 'ఎక్కడికిపోతాయి వెధవ పోలికలు! అన్నీ మేనమామ బుద్ధులే' అని పిల్లల్ని తిడుతూంటారు. కొంత మంది వాళ్ళ ఆడపిల్లలకి సంబంధం కుదుర్చుకునేప్పుడు ప్రత్యేకంగా మేనమామ గురించి ఆరా తీస్తారు. ఏదో భగవంతుడి దయవల్ల మన కవల పిల్లలిద్దరూ ఫస్ట్ క్లాస్ తెచ్చుకుని యింజనీరింగ్ చదువుకుంటున్నారు. అదే మీ అన్నయ్య పోలిక వచ్చుంటే అతనిలా ఏ కాఫీ హోటలో పెట్టుకునేవారు" అన్నాడు వెంకటేశ్. "సర్లెండి బడాయి, మా అన్నయ్యని ఏం ఎద్దేవా చెయ్యక్కర్లేదు. అసలు మా అన్నయ్యంత నిజాయితీగా ఎవ్వరూ హోటల్ నడపలేరు. దగ్గర ఊళ్ళ నుంచి కూడా వచ్చి టిఫిన్స్ తిని పోతూంటారు. పైగా ప్రతిరోజూ సాంబారూ చెట్నీ మిగిలిపోతే అవి పారేయిస్తాడు కానీ ఆ మర్నాడు తయారుచేసిన వాటిల్లో అవి కలపనివ్వడు. దగ్గర్లో వున్న కాలేజీ పిల్లలంతా వచ్చి మావయ్యగారూ అంటూ పలకరిస్తారు. కొంతమందైతే మావయ్య హోటల్ అంటారు" అంది విమల.

"సర్లే! మీ పుట్టించి వాళ్ళ గురించి ఏదైనా విషయం మొదలెడితే నీకు ఒళ్ళు తెలీదు, ఇక ఆపేయి! నా ఆఫీసు టైమ్ అయిపోతుంది!"

"అది సరేనండి! ఈ వేసంగి శెలవులకి అన్నయ్య మన పిల్లలిద్దర్నీ వాళ్ళ ఊరు పంపమన్నాడు ఒక్కసారి పంపుదామండి లేకపోతే బాగుండదు!"

"సరే చూద్దాం!"

000

వేసం కాలంలో ఒకరోజు ఫోన్ చేసి, "ఏమిటే, విమలా! వేసంగి శెలవులైపోతున్నాయి! రాముడు లక్ష్మణుడు యింకా మా ఊరు రాలేదు!" అన్నాడు విమల అన్నయ్య.

"ఇంకా ఒక నెల శెలవులున్నాయి! మీ బావగారితో చెప్పి ఓ రెండ్రోజుల్లో పంపుతాన్లే అన్నయ్యా!" అంది విమల.

సాయంకాలం భర్త యింటికి రాగానే చెప్పింది విమల "ఈరోజు మా అన్నయ్య ఫోన్ చేశాడండి పిల్లలిద్దర్నీ పంపమని. ఒక్కసారి పంపుదాం!"

"సరే కానీ! ఒక పదిరోజులుండి వచ్చెయ్యమను" అన్నాడు వెంకటేశ్.

రాముడూ లక్ష్మణుడూ మేనమామగారింటికి వెళ్ళారు. రోజూ పొద్దున్నే హోటల్‌కి వెళ్ళి మధ్యాహ్నం దాకా కూర్చుని వచ్చేవారు. రాముడు వడ సాంబారూ లాగించే వాడు. లక్ష్మణుడు ఉప్మా పెసరట్టు అల్లం చెట్నీతో ఊదేసేవాడు. పాపం వాళ్ళ ఊళ్ళో అయితే వాళ్ళ అమ్మ విమల చేసిన టిఫిన్లే తప్ప బయట తినేవారు కాదు. "వెర్రివెధవల్లారా! ఏది కావలిస్తే అది తినండి మొహమాట పడకండి" అనేవాడు ఆప్యాయంగా మేనమావ.

ఒకరోజు లక్ష్మణుడు అన్నాడు "అస్తమానూ ఆ వడ సాంబారే తింటావేంట్రా యీ ఉప్మా పెసరట్టు అల్లం చెట్నీతో ఒక్కసారి తిని చూడు ఇక వదలవు!"

తమ్ముడు చెప్పినట్లు ఉప్మా పెసరట్టు తిన్నాడు రాముడు. "అబ్బ! మావయ్య పెసరట్టు ఏమిరుచి! ఏమిరుచి! ఏమి రుచిరా!" అని పాడుకున్నాడు.

ఒకరోజు "రవ్వదోశ కూడా తినండ్రా! వెధవల్లారా!" అన్నాడు మావయ్య, రమ్యంగా ఆరోజు రవ్వదోశలు రెండేసి మటుమాయం చేశారు! ఇంటికి వచ్చి, అత్తయ్యతో అన్నారు "మైసూర్ పాక్ లాటి మా మావయ్యని చేసుకోవడం నీ అదృష్టం అత్తయ్యా!"

"నేను మాత్రం డబుల్‌కా మీఠాని కానా!" అంది అత్తయ్య, నవ్వుతూ.

"ఎవరు కాదన్నారు అత్తా! నువ్వు డబుల్‌కా మీఠావి, మీ పిల్లలు అందులోని జీడిపప్పులు" అన్నాడు లక్ష్మణుడు.

అప్పుడే వచ్చిన మావయ్య కూతుళ్ళిద్దరూ "మమ్మల్ని జీడిపప్పుతో పోల్చి తినేద్దామని చూస్తున్నారు కాబోలు బావలు" అన్నారు.

"ఏమో నాకు ఉప్మా పెసరట్టే యిష్టం!" అన్నాడు లక్ష్మణుడు.

"నేను వడా సాంబారే తింటాను" అన్నాడు రాముడు, "నేను హార్లిక్స్ తాగను తింటాను అన్న మోడల్లో!

శెలవులయిపోయి వాళ్ళ ఊరెళ్ళేసరికి, రాముడు లక్ష్మణుడూ రెండేసి కిలోల చొప్పున బరువు పెరిగారు.

తర్వాత వేసం కాలం కూడా మళ్ళీ మావయ్యగారి ఊరు వెళ్ళి, వాళ్ళకిష్టమైన ఐటమ్స్ సుష్టుగా తిన్నారు. ఈ వేసం కాలం మూడేసి కిలోల బరువు పెరిగారు.

ఈ హోటల్ తిళ్ళు తినక పూర్వం రోజూ రాత్రి పడుకుని కూడా చదువు గురించే ఆలోచన చేసేవారు, ఇప్పుడేమో తమ మేనమావగారి హోటల్లో బాగా నచ్చిన తిను బండారాల గురించి మాట్లాడు కుంటున్నారు.

"అసలు ఆ అల్లం చెట్నీ అంతా బాగా ఎలా చేస్తార్రా, ఆ హోటల్లో!" అని లక్ష్మణుడంటే, "నీ మొహం అస్తమానూ ఆ ఉప్మా పెసరట్లు అల్లం చెట్నీ తప్ప యింకో ధ్యాసలేదు నీకు!" అన్నాడు రాముడు. అన్నగారు చదువు మీద ధ్యాస లేదని తిడుతున్నాడేమో అనుకున్నాడు లక్ష్మణుడు.

"అసలా సాంబారు ఎలా చేస్తారో! రోజూ తిన్నా కానీ విసుగురాదురా! ఆ వడలు కూడా మామయ్య పెద్ద కూతురు ప్రమీల బుగ్గల్లా మిసమిసలాడి పోతుంటాయి!" అన్నాడు రాముడు.

"అసలు మామయ్య హోటల్లో పెనం కూడా అతని రెండో కూతురు రమ జట్టులా నల్లగా మెరిసిపోతూంటుందిరా!" అన్నాడు లక్ష్మణుడు.

"ఇక పడుకుందాం నాన్న వింటే చంపేస్తాడు" అన్నాడు రాముడు.

"ఆ ఎన్నాళ్ళు పడివుంటాం! వింటే విననీ! మనకీ యుక్తవయస్సొస్తూంది కదా!" అన్నాడు మీసాలు తడుము కుంటూ లక్ష్మణుడు.

ఈ తిండి ధ్యానలోపడిన కవలల చదువు దెబ్బతింది! ఇంజనీరింగ్ మూడో సంవత్సరం ముచ్చటగా యిద్దరూ తప్పారు.

ఇంట్లో నానా రభసా అయింది! "ఆఖరికి వీళ్ళు మీ అన్నయ్యలా ఏ కాఫీ హోటలో పెట్టుకునేలా ఉన్నా రన్నాడు" వెంకటేష్.

"అదే వద్దు! అస్తమానూ మా పుట్టింటి వాళ్ళను ఆడిపోసుకో వద్దు! వీళ్ళు సరిగ్గా చదవకపోతే మా అన్నయ్యదా బాధ్యత!" అంది విమల.

"మీ అన్నయ్యది కాదే! వడా సాంబారూ ఉప్మా పెసరట్టుదే!" అని కోపంగా పళ్ళు కొరికాడు వెంకటేశ్.

"తిండి వలన కండ కలుగు! కండకలవాడే మనిషి" అంది విమల -

"అవును కండ వుంటే పిండి రుబ్బుకోవచ్చు!"

"నా పిల్లలు పిండి ఎందుకు రుబ్బుతారూ!"

"అవును గ్రైండర్స్ వున్నాయి కదా! ప్లేట్లు కడుగుతారు" అంటూ బయటకి కోపంగా వెళ్ళిపోయాడు వెంకటేష్.

"విన్నారా! వెధవల్లారా! యీ ఏడాదైనా బాగా చదవండి! లేకపోతే మీ మావయ్యనీ, నన్నూ తిట్టి పోస్తారు మీ నాన్న!" అంది విమల.

పాపం కుఱ్ఱాళ్ళు మంచి వాళ్ళే ! వెంటనే 'సరే' నన్నారు. సరే అయితే అన్నారు కాని, ఆ తిండి మీద ధ్యాస పోలేదు! ఒకరోజు తెల్లారకట్ల రాముడు, "వడ సాంబారూ" అని, లక్ష్మణుడు "ఉప్మా పెసరట్టూ అల్లం చెట్నీ యింకొంచెం వెయ్యి" అంటూ కలవరిస్తున్న తన కొడుకులిద్దర్నీ లేపి, "వెధవల్లారా" అంటూ చితక బాదాడు, వెంకటేష్.

"ఇక వీళ్ళ యింజనీరింగ్ మీ అన్నయ్య హోటల్లో పెనంలా మసిబారిపోయిందే" - అంటూ విలమకి కథ చెప్పాడు.

"పూర్వం ఒక గురువుగారు ఒక శిష్యునికి తన యింట్లోనే వుంచుకుని అన్నం పెట్టి చదువు చెప్పాడట. కొన్నాళ్ళ తర్వాత ఒకరోజు గురువుగారి సహ పంక్తిని భోజనం చేస్తూ, గురుపత్ని వడ్డించిన చమురు వాసన చూసి "ఏమిటి యిది ఆముదం వాసన వేస్తోంది!" అన్నాడట శిష్యుడు.

భోజనమయిన తర్వాత, "నీకిక చదువురాదు! ఈ పదేళ్ళు ఆముదం వేసినా నీకు తెలియలేదు! ఇన్నాళ్ళూ నీ దృష్టి చదువు మీదే లగ్నమయి వుంది! కాని యిప్పుడు నీ ధ్యాస తిండిమీదకి మళ్ళింది. తిండి మీద దృష్టి వున్న వానికి చదువు రాదు, ఇక వెళ్ళు!" అని గురువుగారు శిష్యునికి ఉద్వాసన చెప్పారట.

పై కథ విన్న విమలకి విషయం బోధపడింది! కాని అప్పటికే పరిస్థితి చెయిజారి పోయింది! తర్వాత, కవలలు "రామ్ అండ్ లక్ష్మణ్ కేఫ్" పెట్టుకున్నారు.

## పద్య మకరందం

శ్లో. శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతోవక్షోముఖాంగేషు యే
లోకానాం స్థితి మావ హన్త్యవిహితాం స్త్రీపుంసయోగోద్భవామ్,
తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమాంబుజభవ శ్రీకంధరాః శ్రేయసే.

- నన్నయ 'భారతం'

ఉ. అంబ, నవాంబుజోజ్జ్వల కరాంబుజ, శారద చంద్ర చంద్రికా
డంబర చారుమూర్తి, ప్రకటస్ఫుట భూషణరత్న రోచి రా
చుంబిత దిగ్విభాగ, శ్రుతి సూక్త వివిక్త నిజ ప్రభావ, భా
వాంబర వీథి విశ్రుత విహార, ననుంగృపజూడు భారతీ !

- ఎఱ్ఱన్న 'భారతం'